సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 22 । మార్చి । 2023



ఆకట్టుకున్న మిత్ర మిలన్
జిల్లా కేంద్రంలోని రవీందర్‌శర్మ గురూజీ కళాశ్రమంలో నిర్వహిస్తున్న మిత్ర మిలన్ రెండో రోజుకు చేరింది. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు కళాకారులు విచ్చేశారు. 10లో▸



అడవుల సంరక్షణ అందరి బాధ్యత
అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని పలువురు పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని మంగళవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0/21.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉగాది ఉత్సవాలకు జిల్లా విద్యార్థులు



రాష్ట్ర గవర్నర్ తమిళిసైతో జిల్లా విద్యార్థినులు

ఆదిలాబాద్‌టౌన్: శుభకృత్ నామ ఉగాది పండగ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజ్‌భవన్‌లో యువ ఉగాది సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి పలువురు విద్యార్థినులకు ఆహ్వానం లభించింది. ఈమేరకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రాష్ట్ర గవర్నర్‌తో కలిసి విందుకు హాజరయ్యారు. పట్టణంలోని ఓ కళాశాలకు చెందిన సాక్షి శర్మ, జానం ప్రసన్న, వి.హిమజ పాల్గొన్నారు. వీరికి కూచిపుడి, కర్నాటక సంగీతం, వీణ, తదితర కళారంగాల్లో ప్రావీణ్యం ఉండడంతో ఆహ్వానం లభించింది. ఏటా మేధావులతో ఉత్సవాలు నిర్వహిస్తుండగా ఈసారి యువతకు అవకాశం కల్పించారు.

జిల్లావాసులకు కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఉగాది పండగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరంలో అందరికి శుభాలే జరగాలని ఆకాంక్షించారు.

పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం

నేరడిగొండ: జిల్లాలో ఇటీవల వడగళ్లతో వాటిల్లిన పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. ఈమేరకు మండలంలోని కుప్టి, కుమారి గ్రామాల్లో పర్యటించారు. అకాల వర్షానికి జొన్న, మొక్కజొన్న నేలవాలిందన్నారు. నష్ట నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట బోథ్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్‌స్వామి, ఏవో భాస్కర్, సర్పంచ్ రాజుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, ఉపసర్పంచ్ నరేశ్‌రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో జనరల్ విద్యార్థులు 8,517 మందికి గాను 8,055 మంది విద్యార్థులు హాజరయ్యారు. 462మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 976 మందికిగాను 827మంది హాజరయ్యారు. 149 మంది గైర్హాజరయ్యారు. డీఐఈవో రవీందర్‌కుమార్ పట్టణంలోని ఆదిత్య జూనియర్ కాలేజీని పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

శుభాలనిచ్చే.. శోభకృత్





- తెలుగు సంవత్సరాదికి సిద్ధం
- పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు
- నేడు ఉగాది

ఆదిలాబాద్: ఉగాది.. వసంత రుతువు ఆగమనంతో వచ్చే పండుగ. చైత్ర శుద్ధ పాఢ్యమి నుంచి మొదలవుతుంది. తెలుగు వారు నూతన సంవత్సరంగా భావించే ఈ రోజున కొత్త కార్యాలు ప్రారంభిస్తే శుభప్రదంగా ఉంటుందని నమ్మకం. అలాగే సాయంత్రం పంచాంగ శ్రవణం ఉంటుంది. పండితులు తిథి, వారం, నక్షత్రం, యోగం, కారణం అనే ఐదు అంశాలను ప్రస్తావిస్తారు. ఈమేరకు జిల్లాలోని పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. ఇక పండుగ స్పెషల్ షడ్రుచుల పచ్చడి. ఏడాది పొడవునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఈ పచ్చడి అందిస్తుంది.

ఆదిలాబాద్‌లో..'ఆరుకుంటారు..'
ఉగాది రోజున నూతన కార్యాన్ని ప్రారంభించడం శుభసూచకంగా భావిస్తారు. ఈ నేపథ్యంలోనే అన్నదాతలు వేకువజామునే పొలంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం జొన్నగట్క, చింత పులుసుతో కూడిన నైవేద్యాన్ని నివేదిస్తారు. నాగలితో చేనులో ఐదు సార్లు దున్ని, పంటలు బాగా పండాలని మొక్కుకుంటారు. ఇంటికి చేరి, సూర్యోదయ సమయంలో పేడను తీసుకెళ్లి ఎరువుకు సూచికగా చేనులో వేస్తారు. ఈ విధానాన్ని స్థానికంగా 'ఆరుకోవడం'గా వ్యవహరిస్తారు.

పుష్కలంగా పంటలు ..



శోభకృత్ నామ సంవత్సరంలో వర్షాలు అనుకూలంగా ఉంటాయి. నల్లని భూముల్లో నల్లని, తెల్లని పంటలు విశేషంగా పండుతాయి. అధిక మాసం శ్రావణం. రాజకీయపరంగా పరస్పర పొత్తులు, నిందారోపణలు అధికంగా ఉంటాయి. కార్తీక మాసం నుంచి రాజకీయ నాయకుల మధ్య వైరం కొనసాగుతుంది. ప్రజామోదమైన ప్రభుత్వం ఏర్పడుతుంది. ప్రజలు, పాలకులకు మధ్య ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– ప్రముఖ పంచాంగ కర్త చికిలి వెంకటేశ్వర సిద్ధాంతి

పుర ప్రజావాణికి 22 అర్జీలు

కైలాస్‌నగర్: పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పుర ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శైలజ కోరారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. మొత్తం 22 అర్జీలు అందినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ సెక్షన్‌కు సంబంధించినవి 14, ఇంజనీరింగ్ సెక్షన్ 3, టౌన్ ప్లానింగ్ 4, శానిటేషన్ విభాగానికి సంబంధించినవి 1 చొప్పున ఉన్నాయి. వాటిని పరిశీలించిన ఆమె సంబంధిత విభాగాల అధికారులకు అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, పెంటాజీ, రవీందర్ పాల్గొన్నారు.

మన ఊరు–మన బడి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: మన ఊరు–మన బడి కార్యక్రమ మొదటి విడత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్లి కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మన ఊరు–మన బడి పనులతో పాటు ఆయా పాఠశాలల్లో ఉపాధి హామీ కింద చేపడుతున్న ప్రహరీ, కిచెన్ షెడ్, మరుగుదొడ్ల పనులు సైతం పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు 234 పాఠశాల్లో పనులు ప్రారంభించగా, 13 పాఠశాలల్లో పూర్తయినట్లు తెలిపారు. నూతన విద్యా సంవత్సరం నాటికి మొదటి విడత బడుల్లో అన్ని పనులు పూర్తయి విద్యా బోధన జరగాలన్నారు. వివిధ పథకాల కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తిచేసి రికార్డులను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇటీవల మరణించిన బేల ఎంపీడీవో రవీందర్ మృతికి సంతాప సూచకంగా అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, పంచాయతీరాజ్ ఈఈ మహావీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

జూన్ నాటికి మొక్కలను సిద్ధం చేయాలి
అనంతరం హరితహారం, ఉపాధి హామీ తదితర అంశాలపై ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నర్సరీల్లో ఇప్పటివరకు 34 శాతం విత్తనాలు మొలకెత్తాయని పంచాయితీ కార్యదర్శులతో సమీక్షలు నిర్వహించి మొక్కల ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న హరితహారం కార్యక్రమం నాటికి అవసరమైన మొక్కలు అందించేలా చూడాలన్నారు. ఉపాధి పనుల నిర్వహణ, పర్యవేక్షించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. ప్రతీ గ్రామపంచాయతీ ఆర్థిక సంవత్సరంలో ప్రోగ్రెస్ రూపొందించాలన్నారు. ఉత్తమ ప్రగతి సాధించిన పంచాయతీ కార్యదర్శిని అభినందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గణపతి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో 'చైల్డ్ ప్రొటెక్షన్' విచారణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో చోటు చేసుకున్న ఘటనపై చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాలలోని విద్యార్థినులతో పాటు ప్రిన్సిపాల్, డీవైఎస్‌వోను విచారించారు. ఈ మేరకు నివేదికను జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాజేంద్రప్రసాద్ మంగళవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా కోచ్‌పై చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా బాధిత విద్యార్థిని కుటుంబ సభ్యులు స్పోర్ట్స్ స్కూల్‌కు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారుల కోసం నిరీక్షించారు. పాఠశాలలో పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోచ్ నివాసం వసతిగృహ సమీపంలో ఉండడంతో విద్యార్థులతో ఇంటి పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు.

డీవైఎస్‌వోపై కలెక్టర్‌కు ఫిర్యాదు
కైలాస్‌నగర్: జిల్లా క్రీడామండలి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లును ఆ బాధ్యతల నుంచి వెంటనే తప్పించాలని వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం కలిసి ఆయనపై ఫిర్యాదు చేశారు. ఆయనకు డీఎస్‌ఏతో పాటు ఇతర శాఖల అదనపు బాధ్యతలు ఉన్నాయని దీంతోనే క్రీడా పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్లో బాలికలను వేధింపులకు గురిచేసిన అథ్లెటిక్స్ కోచ్ రవీందర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి, పీఈటీలు పాల్గొన్నారు.

అమ్మ చెంత ఆత్మహత్యాయత్నం

- బాసర ఆలయంలో మణికట్టు కోసుకున్న యువకుడు
- అడ్డుకుని అదుపులోకి తీసుకున్న భద్రతాసిబ్బంది
- గతంలో నాలుగుసార్లు అఘాయిత్యం
- ఆలయంలో ఆత్మహత్యే లక్ష్యంగా రాక..
- విచారణ చేపట్టిన పోలీసులు


బాసర ఆలయంలో భద్రత సిబ్బంది అదుపులో ప్రసాద్‌గౌడ్

భైంసా: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞానసరస్వతీ అమ్మవారి పాదాల చెంత ఆత్మార్పణే లక్ష్యమంటూ ఓ యువకుడు చేస్తున్న సంఘటన కలవర పెడుతోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రసాద్‌గౌడ్ మంగళవారం మరోమారు బాసర ఆలయానికి వచ్చి పదునైన కత్తితో మణికట్టు కోసుకుని రక్తార్పణం చేశాడు. ఆ సమయంలో అడ్డుకునేందుకు వచ్చిన భక్తులు, అక్కడున్న సిబ్బందిని కత్తితో బెదిరించాడు. భద్రతాసిబ్బంది అప్రమత్తమై ప్రసాద్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని బాసర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తానెందుకు వచ్చానో తెలియదన్నాడు. కత్తి ఎందుకు ఉందని ప్రశ్నించగా, తాను తెచ్చిన బస్తాలో మామిడికాయలు కోసేందుకు వెంట ఉంచుకున్నానని సమాధానమిచ్చాడు. పదేపదే బాసర వచ్చి ఎందుకు ఇలా చేస్తున్నావని ప్రశ్నించగా, సమాధానం దాటవేసే ప్రయత్నం చేస్తున్నాడు.

పదేపదే బాసరకు...

నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సిలివేరు ప్రసాద్‌గౌడ్ తల్లిదండ్రులు చనిపోయారు. సోదరుడి దగ్గరే పెరిగి అక్కడే చదువుకున్నాడు. ప్రసాద్‌గౌడ్ ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతూ మానసికంగా కుంగిపోయాడు. అప్పుడప్పుడు బాసర ఆలయానికి వస్తూ వెళ్లేవాడు. 2016లో తొలిసారి అమ్మవారి చెంత ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పదునైన చాకుతో మణికట్టు కోసుకున్నాడు. స్పందించిన ఆలయ సిబ్బంది వెంటనే అప్రమత్తమై అదుపులోకి తీసుకున్నారు. తర్వాత మరో మూడుసార్లు ఆలయంలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానిక భక్తులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కత్తితో, బ్లేడ్‌తో కోసుకున్న ప్రసాద్‌గౌడ్ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం కొంతకాలానికి మళ్లీ బాసర వచ్చి ఆత్మహత్యకు ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

పండుగలకు ముందు..

ప్రసాద్‌గౌడ్ ఇప్పటికే బాసర జ్ఞాన సరస్వతీ ఆలయంలో ఐదుసార్లు ఆత్మహత్యకు యత్నించాడు. బాసరకు వచ్చే సమయంలో మంచిరోజులు, పండుగలు, శుభముహూర్తాలు ముందే చూసుకుంటాడు. దీపావళి సందర్భంగా గతంలోనూ బాసరకు వచ్చాడు. తాజాగా ఉగాది పర్వదినానికి ఒకరోజు ముందుగా ఇక్కడికి వచ్చాడు. అమావాస్య రోజు అమ్మవారి చెంత ఆత్మహత్య చేసుకుంటే స్వర్గానికి వెళ్తాననే మూఢనమ్మకం ఇతనిలో నాటుకుపోయింది. గతంలో గర్భగుడిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతాసిబ్బంది అడ్డుకున్నారు. గొంతు, మణికట్టుపై పదేపదే పదునైన కత్తి, బ్లేడుతో కోసుకుని, అడ్డువచ్చినవారిపై తన వద్ద ఉన్న కత్తితో బెదిరించడం అక్కడివారిని చెదరగొట్టడం ప్రసాద్‌గౌడ్ చేస్తుంటాడు. బాసర పోలీసులు, అధికారులు ఇప్పటికే ప్రసాద్‌గౌడ్‌కు పలుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా ఆయన తీరు మారడం లేదు. మంగళవారం కూడా బాసర పోలీసులు ప్రసాద్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని మానసికస్థితి ఆధారంగా విచారణ చేస్తున్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి


గాంధీ చౌక్ వద్ద ధర్నా చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

నార్నూర్: కెరమెరి మండలం అగర్వాడ గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి మృతికి కారణమైన లావుడ్యా రమేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు ఆందోళనకు దిగారు. మంగళవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి సంఘం, తుడుందెబ్బ జిల్లా నాయకుడు దాదిరావు మాట్లాడారు. అగర్వాడ గ్రామానికి చెందిన జుగ్నాక రేణుక నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఏఎన్‌ఎంగా పనిచేస్తోందని తెలిపారు. లావుడ్యా రమేశ్ ఆమెను ప్రేమించి సహజీవనం చేశాడని, ఈక్రమంలో ఆమె గర్భం దాల్చిందని పేర్కొన్నారు. డెలివరీ సమయంలో చిత్రహింసలు పెట్టడంతో మరణించిందని ఆరోపించారు. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లకుండా కెరమెరి మండల కేంద్రంలో వదలివెళ్తున్న క్రమంలో అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. అతడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కొట్నాక్ కృష్ణ సార్‌మేడి, పెందూర్ సంతోష్, ఓనేరావు, బాపురావు, అంబదాస్ తదితరులున్నారు.

వికటించిన నాటు వైద్యం

- భార్య మృతి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త

ఆదిలాబాద్‌టౌన్: నాటు వైద్యం వికటించి వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన సిల్వేర్ రాజన్న, ఆయన భార్య లక్ష్మి (75) కొంతకాలంగా కాళ్ల నొప్పులు, ఇతర సమస్యలతో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్నా నయం కాలేదు. నొప్పుల బాధలు, షుగర్‌తో ఇబ్బందులకు గురికాగా, ఎవరో నాగముష్టి వేరు తాగితే నొప్పులు తగ్గుతాయని చెప్పారు. దీంతో వారిద్దరూ మంగళవారం ఉదయం వేర్లను నీళ్లలో నానబెట్టిన అనంతరం తాగారు. కొద్దిసేపటి తర్వాత లక్ష్మి అపస్మారక స్థితికి చేరుకుంది. రాజన్నకు తల తిరగడంతో కుటుంబీకులు వారిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రికి చేరుకోక ముందే లక్ష్మి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజన్న కోలుకుంటున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు.

‘ఆరోగ్య మహిళ’ను సద్వినియోగం చేసుకోండి

- వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు


రికార్డులు పరిశీలిస్తున్న జేడీ జాన్ బాబు

బజార్‌హత్నూర్: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్, ఆరోగ్య మహిళ కార్యక్రమ ప్రత్యేక అధికారి జాన్‌బాబు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య సమస్య ఉన్న మహిళలు ఇక్కడ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వారి వెంట మెడికల్ ఆఫీసర్లు శిల్ప, భీంరావ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజేపీ పాఠశాల తనిఖీ


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న గోపీచంద్

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామంలోని ఎంజేపీ పాఠశాల, కళాశాలను మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో గోపీచంద్ ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనశాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఏటీపీ సురేశ్, డీడబ్ల్యూవో నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ మృతి

ముథోల్: మండలంలోని నయాబాదీ కాలనీకి చెందిన రుఖీయా బేగం (27) ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజులుగా రుఖీయా బేగం మానసిక పరిస్థితి బాగా లేదు. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాకు చెందిన రాథోడ్ రామకృష్ణ (24) ద్విచక్ర వాహనం అదుపు తప్పి మృతి చెందాడు. ఏఎస్‌ఐ మాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణ సోమవారం నర్సాపూర్(జి)లో పని ముగించుకొని రాత్రి 10 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. మార్గంమధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన గొల్లమాడ గ్రామస్తులు రామకృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. 108లో భైంసా ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. కాగా, హెల్మెట్ ధరించి ఉంటే రామకృష్ణ బతికేవాడని గ్రామస్తులు భావిస్తున్నారు.

విషాహారం తిని 15 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న వైద్యాధికారి

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలోని దేవన్నకు చెందిన 15 గొర్రెలు మంగళవారం మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దేవన్నకు చెందిన 105 గొర్రెలు సోమవారం సాయంత్రం విషాహారం తిన్నాయి. మంగళవారం గొర్రెల మందను మేతకు తీసుకువెళ్లే క్రమంలో 20 అస్వస్థతకు గురయ్యాయి. ఇందులో 15 కొట్టంలోనే మృతి చెందగా, మరో ఐదు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి ప్రకాశ్, జేవీవో శశిధర్, సిబ్బంది సాయిరాం, లింగన్న మిగతా గొర్రెలకు చికిత్స అందించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ.1.5 0లక్షలు ఉంటుందని దేవన్న తెలిపాడు.

వాగులో గల్లంతై పశువుల కాపరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి శివారు ప్రాంతంలో వాగు దాటుతూ పశువుల కాపరి గొంటిముక్కల గంగన్న (60) మృతి చెందాడు. ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంసరి శివారు ప్రాంతంలో మంగళవారం గంగన్న పశువులను మేపుతున్నాడు. కొన్ని పశువులు వాగు దాటి వెళ్లాయి. వాటి కోసం వెళ్తున్న గంగన్న వాగు దాటుతూ నీటిలో గల్లంతై మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత


పెంబిలో బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో గుడుంబా అమ్ముతుండగా పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మందపల్లి గ్రామానికి చెందిన శ్రీపతి లక్ష్మి గుడుంబా అమ్ముతుండగా ఆమెకు నోటీస్ ఇచ్చి స్థానిక తహసీల్దార్ శ్రీధర్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం పెంబి శివారు ప్రాంతంలో మొక్కజొన్న చేనులో నిల్వ చేసిన 200 లీటర్ల బెల్లపు పానకాన్ని పారబోశారు. ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, ముత్యం, ప్రకాశ్, గౌతం, నీరోషా ఉన్నారు.

మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: నెలల తరబడి రేయింబవళ్లు నిరుద్యోగులు కష్టపడి చదువుతుంటే పేపర్ లీకేజీ చేయడం దారుణమని, ఇలాంటివి సర్వసాధారణమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో సర్కార్ చెలగాటం ఆడుతోందని పేర్కొన్నారు. నిర్మల్ మున్సిపాలిటీలోనూ 42 ఉద్యోగాలనూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేరవుతున్న నిరుద్యోగుల విషయంలో మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని తెలిపారు. మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సినీ ఫక్కీలో చైన్ స్నాచింగ్


బాధితురాలు గంగుబాయి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో దుండగులు సినీ ఫక్కీలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ కంటైనర్‌ను హైజాక్ చేసి దోపిడీకి పాల్పడిన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఓ చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. మహిళ మెడలోంచి బంగారు గొలుసును అపహరించాడు. సీసీ ఫుటేజీలో వాహనంపై వెళ్తున్న మహిళతో పాటు దుండగుడు కనిపిస్తున్నా హెల్మెట్ పెట్టుకొని ఉండడంతో ముఖం కనిపించడంలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. చైన్ స్నాచింగ్‌కు గురైన బాధితురాలు గంగుబాయి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డులో గంగుబాయి నివాసముంటోంది. మున్సిపల్‌లోని ఆడిట్ కార్యాలయంలో సబార్డినేటర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈమె బంధువు బస్టాండ్ సమీపంలోని తిరుమల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉదయం ఆస్పత్రికి స్కూటీపై బయల్దేరింది. ఆస్పత్రి అడ్రస్ తెలియకపోవడంతో ఆమె బస్టాండ్ వెనుకవైపు విద్యానగర్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తోంది. ఈ క్రమంలో కొమురంభీం చౌక్ దాటిన తర్వాత బిర్యానీ హౌస్ ముందు పల్సర్ బైక్‌పై ఓ వ్యక్తి హెల్మెట్ పెట్టుకొని తన వాహనం వెంట వచ్చినట్లు తెలిపింది. ఒక్కసారిగా తన మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లినట్లు పేర్కొంది. ఈ సమయంలో ఆమె స్కూటీ నుంచి కింద పడగా స్వల్ప గాయాలైనట్లు వాపోయింది. అరుపులు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే దొంగ బైక్‌పై పరారయ్యాడు. కలెక్టరేట్ వైపు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ రూట్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితుడు కనిపించకుండాపోయాడు.

భయం గుప్పిట్లో ఝరి(బి)

- అటవీ ప్రాంతంలో చిరుత సంచారం
- పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు


అటవీశాఖ అధికారులు గుర్తించిన చిరుత పాదముద్ర

తానూరు: నిర్మల్ జిల్లా తానూరు మండలం ఝరి(బి) అటవీ ప్రాతంలో చిరుత సంచారంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన బొడ్డోల్ల సాయినాథ్ సోమవారం తన మొక్కజొన్న చేనుకు కాపలాగా వెళ్లగా చేనులో చిరుత కనిపించింది. దీంతో గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. గ్రామస్తులు, పరిసర ప్రాంత రైతులు అక్కడికి చేరుకున్నారు. రైతులు చేసిన శబ్దాలకు చిరుత పులి అటవీ ప్రాంతంలో వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ బీట్ అధికారి మహేశ్ మంగళవారం ఝరి(బి) శివారులోని సాయినాథ్ చేను వద్దకు వెళ్లి పరిశీలించారు. పాదముద్రలను గుర్తించారు. రైతులు అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు.

భయం భయం ...

చిరుత సంచారంతో ఝరి(బి) గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు. గ్రామానికి చెందిన రైతుల చేలన్నీ గుట్ట ప్రాంతంలోనే ఉన్నాయి. సోమవారం చిరుత కనిపించడంతో పంటలకు కాపలా వెళ్లడానికి జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులు చిరుతను గుర్తించి తరలించాలని కోరుతున్నారు.

అడవులను సంరక్షించాలి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం
- ర్యాలీలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

నిర్మల్‌టౌన్: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని, అడవులు నరికి వేస్తే జీవరాశి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని దేవాదాయ, అటవీ, న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మంత్రి కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. అటవీ శాఖ కార్యాలయం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమన్నారు. ఈ విషయం తెలియజేయడం కోసమే ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న తరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ జంగల్ బచావో- జంగల్ బడావో నినాదంతో 2015 నుంచి ఏటా హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎనిమిదేళ్లలో 273 కోట్లకుపైగా మొక్కలు నాటామన్నారు. తెలంగాణలో 2015 నుంచి 2021 వరకు పచ్చదనం శాతం 7.70% పెరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అడవుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితంగా వన్య మృగాల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సునీల్ హిరామత్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.